



సబ్‌రిజిస్టర్ కార్యాలంలో రైతులతో మాట్లాడుతున్న ఎసిబి అధికారులు

చిలమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఎసిబి దాడులు

ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్టర్, సిబ్బందితో వివరాల సేకరణ నాలుగు గంటల పాటు సోదాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని సబ్‌రిజిస్టర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎసిబి ఇన్స్‌పెక్టర్ జయమ్మ, సిబ్బంది సబ్ రిజిస్టర్ కార్యాలయంలోకి వచ్చి తలుపులు మూసి వేసి అందరి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లను తీసుకొని సోదాలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చిన ఆదాయం, ఎంత మేర ఛార్జీల వసూలు తదితర వివరాలను సేకరించారు. కౌంటర్లలో ఉన్న నగదును సీజ్ చేసిన అధికారులు ప్రజల వద్ద ఉన్న డబ్బును మాత్రం తీసుకోలేదు. అయితే ఎందుకోసం, ఏమి పని నిమిత్తం ఇక్కడికి వచ్చారని ప్రజలతో ఆరా తీసి ప్రతి ఒక్కరి వివరాలు, ఫోన్ నెంబరు తీసుకున్నారు. ఈసందర్భంగా ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్టర్ ప్రసాద్ బాబుని విచారించారు. ప్రభుత్వ భూసేకరణలో మీ పాత్ర ఏమిటని ప్రశ్నించిన అధికారులు ప్రజలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల అంశంపై ప్రశ్నించారు. రవి అనే డాక్యుమెంటు రైటర్ కార్యాలయంలో ఉండటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ మీకేం పని అంటూ ప్రశ్నించారు. ప్రయివేటు వ్యక్తులు డాక్యుమెంట్ గదిలో ఉండటంపై ఆమె అనుమానం వ్యక్తం చేస్తూనే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా కార్యాలయం స్టాంపులు వేసే చోట స్వల్ప నగదు దొరికింది. ఆ నగదు విషయమై అక్కడ ఉన్న ఉద్యోగి ని ప్రశ్నించారు. ఆ నగదు ఎందుకు అక్కడుందని అడగగా, ఎవరో పడవేశారని చెప్పగా ఆ నగదును కూడా సీజ్ చేశారు.

నిబంధనలకు పాతర



పరిశ్రమకు కేటాయించిన స్థలంలో నిర్మించిన వాణిజ్యభవనంలో మద్యం దుకాణం

పారిశ్రామికవాడలో మద్యం దుకాణం
పరిశ్రమ స్థలంలో వాణిజ్య భవనాల నిర్మాణాలు
భవనాల్లో మద్యం దుకాణం, పర్మిట్ రూమ్ ఏర్పాటు
నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్న ఎపిఐఐసి అధికారులు

ఎక్సైజ్ అధికారులు నిబంధనలకు పాతర వేశారు. హిందూపురం రూరల్ మండలం తూముకుంట పారిశ్రామిక వాడలో ఏపీఐఐసీ నిబంధనలకు తిలోదకాలిచ్చారు. పరిశ్రమలకు కేటాయించిన స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య భవనాలను నిర్మించి అందులో మద్యం దుకాణాలు, పర్మిట్ గదులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజాశక్తి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వెలుగులోకి తీసుకురాగా ఏపీఐఐసీ అధికారులు స్పందించి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప ఏటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో స్వార్థపరులు మరింత రెచ్చిపోయి మరిన్ని భవనాలను నిర్మించారు. పరిశ్రమకు కేటాయించిన స్థలంలో వాణిజ్య సముదాయాలు వెలిశాయి.

ప్రజాశక్తి-హిందూపురం

పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు రైతుల నుంచి సేకరించిన భూములను ఏపీఐఐసి తరపున పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తారు. కేటాయించిన స్థలంలో ఏ పరిశ్రమ అయితే స్థాపిస్తామనిపారిశ్రామికవేత్తలు దరఖాస్తులో పేర్కొన్న విధంగా అదే పరిశ్రమను ఆ స్థలంలో ఏర్పాటు చేయాలన్నది నిబంధన. అయితే నిబంధనలకు పాతర వేసిన ఓ పారిశ్రామిక వేత్త ఏకంగా వాణిజ్య భవనాలను నిర్మాణం చేసి అద్దెకిచ్చి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇది తెలిసినప్పటికీ ఏపీఐఐసీ అధికారులు ఆ పారిశ్రామికవేత్త ఇచ్చే మామూళ్ల మత్తులో తూగుతూ చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పారిశ్రామిక వాడలో మద్యం దుకాణం నిర్వహించడం పై అటు పారిశ్రామికవేత్తలు, కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నప్పటికీ అధికారులు తమకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తున్నారు. భోజన విరామ సమయంలో కార్మికులు బయటకు వెళ్లి మద్యం సేవించి తిరిగి విధుల్లోకి వస్తున్నారని, మద్యం మత్తులో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే దానికి బాధ్యత యాజమాన్యమే వహించాల్సి వస్తుందని పరిశ్రమల యజమానులు ఆందోళన చెందుతున్నారు. మద్యం దుకాణానికి కూత వేటు దూరంలో గార్మెంట్స్ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో వందలాదిమంది మహిళలు విధులకు హాజరవుతున్నారు. సాయంత్రం గార్మెంట్స్ పరిశ్రమలలో విధులు ముగించుకొని తిరిగి వెళ్లే సమయంలో మద్యం మత్తులో మందుబాబులు మహిళలపై అఘాయిత్యాలు పాల్పడితే ఎవరు బాధ్యత అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇన్ని తెలిసినప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు పారిశ్రామిక వార్డులో మద్యం దుకాణం నిర్వహించడానికి అనుమతులను ఎలా ఇచ్చారో ఎవరికి అర్థం కావడం లేదు. పరిశ్రమ స్థలంలో వాణిజ్య భవనాలను నిర్మాణం చేయడంతో పాటు ఆ భవనాలను అద్దెకిచ్చి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంపై కార్మిక సంఘం నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించడంతోపాటు పరిశ్రమకు కేటాయించిన స్థలంలో పరిశ్రమలే స్థాపించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్‌రూము

ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు

తుమకుంట పారిశ్రామిక వాడలో మద్యం దుకాణం ప్రారంభించినప్పటి నుంచి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాము. పారిశ్రామికవాడలో ఈ దుకాణం ఏర్పాటు చేసినప్పటి నుంచి స్టీల్, రసాయన పరిశ్రమలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు మద్యం తాగి విధులకు హాజరవుతున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ తో పాటు ఏపీఐఐసీ అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని పారిశ్రామిక వాడకు దూరంగా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పరిశ్రమకు కేటాయించిన స్థలంలో నిర్మాణం చేసిన వాణిజ్య భవనాలను తొలగించి, పరిశ్రమ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.



రవికుమార్,
తుమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు



ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు రమణ

శ్మశానవాటిక సమస్య పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడి

కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని కొర్లకుంట ఎస్సీ కాలనీవాసుల శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉదతం చేస్తామని మండల వ్యాప్తంగా ఉన్న అన్ని శ్మశాన వాటికల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడికి పూనుకుంటామని కెవిపిఎస్ నాయకులు రమణ హెచ్చరించారు.కొర్లకుంట గ్రామ ఎస్సీ కాలనీ వాసులు శ్మశానానికి దారి చూపించాలని ఐదు రోజులుగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కొనసాగిస్తున్నారు. ఈ ఉద్యమానికి కెవిపిఎస్ జిల్లా కమిటీ బుధవారం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు రమణ మాట్లాడుతూ కొర్లకుంట గ్రామ ఎస్సీ కాలనీ వాసులకు చెందిన వారు ఎవరైనా మృతిచెందితే శవాన్ని పూడ్చడానికి సమస్య ఎదురైనప్పుడు హామీలు ఇచ్చి, ఆ తర్వాత తప్పించుకోవడం అధికారులకు పరిపాటిగా మారిందన్నారు ఎస్సీ కాలనీ వాసుల సమస్యలను విస్మరించడం చిలమత్తూరు తహశీల్దార్‌కే చెందుతుందని విమర్శించారు. అలాగే జీవో 1235 ప్రకారం ప్రతి గ్రామంలో శ్మశానవాటికకు దారి కల్పించడం, శ్మశాన వాటిక లేని గ్రామాలకు రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి ప్రహరీ ఏర్పాటు, నీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జీవోలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, గోపాలకృష్ణ, నరేంద్ర, నరేష్, రామాంజి, మూర్తి, గోపాల్, వేణు, ఆదిలక్ష్మమ్మ, గంగమ్మ, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్వయం ఉపాధి శిక్షణ కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కార్యదర్శి ఆర్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకారంతో మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి పాసై 19-45 ఏళ్ల లోపు మహిళలు అర్హులన్నారు. స్థానిక ధర్మవరం రోడ్డులోని తమ కార్యాలయంలో 14 రోజుల పాటు కొవ్వొత్తులు, పచ్చళ్లు, బేకరీ ఐటమ్స్ తయారీ, జ్యూట్ బ్యాగులు, కూరగాయల బ్యాగుల తయారీ, టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్, తదితర వాటిపై శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు బుక్కు, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్సులు తీసుకుని రావాలన్నారు.

రేషన్ షాపుల వద్ద వివరాలు ప్రదర్శించాలి : ఆర్డీవో

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రతి రేషన్‌షాపు వద్ద నిల్వ, ధర, తదితర వివరాలతో తప్పనిసరిగా బోర్డు ఏర్పాటు చేయాలని ఆర్డీవో మహేష్ డీలర్లను ఆదేశించారు. ఆయన బుధవారం పట్టణంలోని రేషన్ షాపులను సందర్శిం చారు. స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ రికార్డులు, తూకం యంత్రాలు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసేందుకే తనిఖీలు చేపట్టా మన్నారు. డీలర్లు నిర్ణయించిన సమయాల్లో దుకాణం తెరిచి సరుకులు పంపిణీ చేయాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ సురేష్‌బాబు, విఆర్ఒ రవిశంకర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-హిందూపురం

అమరవీరుడు షహీద్ టిప్పు సుల్తాన్ జయంతిని పురస్కరించుకొని టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దేశభక్తి, మతసామరస్యం, పరమత సహనం పెంపొందించే ఉద్దేశ్యంతో ఈ ఈ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు టిప్పు సుల్తాన్ జయంతి రోజున జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

రూ. 90వేల నగదు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి-బత్తలపల్లి

జల్సాలు, చెడు వ్యసనాలకు బానిసలై వాటిని తీర్చుకోవడానికి అవసరమైన డబ్బు కోసం చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసినట్లు ధర్మవరం డీఎస్పీ బి.హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ లో బుదవారం డీఎస్పీ ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్‌తో కలిసి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బత్తలపల్లిలోని విజయచౌదరి కాలనీకి చెందిన ముల్లగూరు అయ్యప్ప గత మార్చి 8వ తేదీ ధర్మవరం రోడ్డులో నిల్చొని ఉండగా బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు కిందపడిపోతుండగా సాయం చేయబోయాడు. ఆ సమయంలో ఆ యువకుడు అయ్యప్ప జేబులో నుంచి సెల్‌ఫోన్ దొంగలించి ఫోన్ పే ద్వారా రూ. 1,82,000 ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో డీఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో రూరల్ సిఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ఓ టీంను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌ను గత నెల 1వ తేదీ అదుపులోకి తీసుకుని విచారించగా మరో ముగ్గురితో కలిసి నేరం చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు అతడి నుంచి రూ. 20వేలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ముగ్గురిలో చిత్తూరు జిల్లా మంగసముద్రంకు చెందిన మేకల లోకేష్, తోట రాకేష్ అలియాస్ చిన్న యేసు, తోట ఇమాన్యుయల్‌గా గుర్తించారు. వీరిని బుధవారం అనంతపురం-కదిరి జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్యన్ డాబా ముందు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి ఓ బైక్, రూ. 70వేలు స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. వీరిని ధర్మవరం కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా మారినట్లు తెలిపారు. కేసు విచారణలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ సుదర్శన్‌నాయుడు, అనిల్‌కుమార్‌కు రివార్డు అందజేశారు. సిఐ, ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కాగా సెల్ ఫోన్ లాక్ గానీ, ఫోన్ పే, ఇతర యుపిఐ యాప్‌లకు లాక్‌గా ఫ్యాన్సీ నెంబర్లు పెట్టుకోవద్దని డీఎస్పీ సూచించారు. ప్రజలు ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐఎస్‌బి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ బుధవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఎఐఎస్‌బి ఆధ్వర్యంలో మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పిపిపి విధానాన్ని రద్దుచేసి, ప్రభుత్వమే మెడికల్ కళాశాలలో నిర్వహించాలని కోరారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేద, సామాన్య విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతామంటూ అనేక ప్రగల్భాలు పలికి, వాటినే ప్రైవేట్ పరం చేస్తామనే ఆలోచనలు దోపిడికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ బి నాయకులు పవన్, గోపి, భరత్ రెడ్డి, వినోద్, భాను ప్రసాద్ రెడ్డి, భార్గవ్, ఉమేష్, ప్రేమ్ కుమార్, మనోజ్, గిరీష్, మదన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆర్ పి జిటీ రోడ్డులో ఉన్న అల్ హిలాల్ ఫంక్షన్ హాల్ లో ఈనెల 9 వతేదీ ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ ఎన్ టి ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ ఎన్ టి వైద్య నిపుణులు శంకర్ నాయక్ బుధవారం తెలిపారు. చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న పట్టణ, పరిసర గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించాలని సంకల్పించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. వైద్య శిబిరంలో ఈఎన్‌టి సమస్యలతో బాధపడుతున్న అందరిని నూతన సాంకేతికతో కూడిన వైద్య పరికరాలతో చెవి, ముక్కు, గొంతు ఎండో స్కోపీ ద్వారా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.



వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు శంకర్ నాయక్

పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధి : మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

పార్టీలకు అతీతంగా హిందూపురం పట్టణాన్ని అభివద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తో కలిసి చైర్మన్ వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ అమ్యూనిటీ సెక్రటరీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రూ 92.5 కోట్లు ప్రత్యేక నిధులను తీసుకురావడం జరిగిందన్నారు. త్వరలో ఈ పనులకు బాలకృష్ణ చేత భూమి పూజ చేయించి ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ప్రతిపక్ష నేత ఆసిఫ్ వుల్లా, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దస్తగిరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వాణి, లోకేష్, మదన్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్లు జనార్ధన్, శంకర్, సచివాలయ అమ్యూనిటీ సెక్రటరీలతోపాటు వార్డు ఇన్‌చార్జులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు గుర్తింపు కార్డులను ఇస్తున్న దృశ్యం

'పది' విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఆఫర్

580కి పైగా మార్కులు సాధిస్తే విమాన ప్రయాణం
గణితంలో 100 మార్కులు సాధిస్తే హంపి పట్టణ సందర్శన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మున్సిపల్ ఓరియంటల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సిద్దగిరి శ్రీనివాస్ ఆఫర్ ప్రకటించాడు. పదవ తరగతి పరీక్షల్లో 580 మార్కులు సాధించిన విద్యార్థులకు బెంగుళూరు నుంచి హైదరాబాదుకు బుధవారం పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు పాఠశాల గుర్తింపు కార్డులను సహాయ కార్మికశాఖ అధికారి ఎస్‌వి. రమణారెడ్డి తన సొంత నిధులతో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే విద్యార్థులకు గతంలో కూడా మాదిరి దుస్తులు, వ్రాత పుస్తకాలు, భోజన పళ్ళెములు అందజేశామన్నారు. బాగా శ్రద్ధగా చదివి ఎక్కువ మార్కులు సంపాదించిన విద్యార్థులకు ఉన్నత చదువులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పదోతరగతి విద్యార్థులకు ప్రోత్సాహం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణం

ప్రజాశక్తి-పెనుకొండ

కుటుంబ కలహాలు ఆర్థిక ఇబ్బందులతో ఓ సర్పంచి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పెనుకొండ మండలం గోనిపేటలో మంగళవారం రాత్రి చోటుచేస్తుంది. బాధితుని కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు.. గోనిపేట సర్పంచి నాగరాజు కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో తన సొంత ఇంటిలో మంగళవారం మధ్యాహ్నం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

ఆర్థిక ఇబ్బందులు.. అధికారులతో గొడవ

పంచాయతీ పరిధిలో తాను చేసిన పనులకు బిల్లుల కోసం సర్పంచి నాగరాజు కొన్ని రోజుల క్రితం అధికారులతో గొడవ పడినట్లు సమాచారం. పంచాయతీ పరిధిలో ఉన్న గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలు ఇచ్చారని మిగిలిన పనులకు బిల్లులు చేయకపోవడంతో అధికారులతో గొడవ పడినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సర్పంచి నాగరాజు ఎంపీని ఆశ్రయించి ఎంపీ బంధువుతో ఎంపీడీవోకు ఫోన్ చేయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే సర్పంచి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసులు దర్యాప్తును తేలాల్సుంది.

ప్రజాశక్తి www.prajasakti.com

ప్రజాసమస్యలపై దృష్టి పెట్టండి

అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, సీసీ రోడ్లు, తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి పర్వీన్‌భాను అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఫిర్యాదులు అందాయని, ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నెలలోపు సమస్యను పరిష్కరించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుంచి చిత్తశుద్ధితో పని చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలన్నారు. గతంలో మంజూరైన ప్రభుత్వ గృహాలను నిర్మించుకోకపోతే వెంటనే నోటీసులు ఇచ్చి వాటిని రద్దు చేయాలని హౌసింగ్, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. రేషన్ షాపుల్లో నిత్యావసరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలన్నారు. తంగేడుకుంట శోత్రియం భూములపై హక్కు కలిగిన రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒడిసిలో ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలన్నారు. వేరుశనగ సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిందని వీటిపై క్షేత్రస్థాయిలో పరిశోధన చేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. ఎపిఎం రవీంద్ర మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి డిఆర్‌డిఎ వెలుగు శాఖ ద్వారా మండలానికి రూ. 40 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే రూ. 20 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కొత్తచెరువు మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, వైస్ ఎంపిపి లక్ష్మీదేవి, వివిధ శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సొసైటీ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూర

టెట్ నుంచి మినహాయించాలి:డిటిఎఫ్

ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని కోరుతూ బుధవారం డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) నాయకులు కట్టుబడి గౌస్ లాజమ్ ఎమ్మెల్యే సింధూరరెడ్డికి వినతిపత్రం అంద జేశారు. లాజమ్ మాట్లాడుతూ 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులు టెట్ పాసై ఉండా లనే సుప్రీంకోర్టు తీర్పుని సవరించేలా కేంద్ర ప్రభుత్వం చట్టం చేసేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు విడుదల

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్ష(ఎన్ఎంఎంఎస్)లకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని జన విజ్ఞాన వేదిక(జెవివి), ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్) సంయుక్తంగా పుస్తక రూపంలో తీసుకొచ్చాయి. ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను బుధవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డిఇఒ జి.కృష్ణప్ప, ఎస్ఎస్ఎ అధికారి డాక్టర్ దేవరాజు, జెవివి, యుటిఎఫ్ నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఈ పరీక్షల్లో విజయం సాధిస్తే కేంద్ర ప్రభుత్వం ఏటా రూ. 12 వేల చొప్పున నాలుగేళ్లు ఉపకార వేతనం ఇస్తుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి పుస్తకాలను జెవివి, యుటిఎఫ్ ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి శివకుమార్, జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సారెడ్డి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు విడుదల చేస్తున్న కలెక్టర్, యుటిఎఫ్ నాయకుల

అమరాపురం-విరుపాసముద్రం రోడ్డు పూర్తి చేయండి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

నియోజకవర్గ వ్యాప్తంగా ఆర్ అండ్ బి రోడ్ల పనులను గడువులోపు నాణ్యతగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సూచించారు. పట్టణంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో బుధవారం ఆయన ఆర్అండ్‌బి స్టేట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఈఈ సంజీవ య్యతో సమావేశమయ్యారు. తిప్పేస్వామి మాట్లాడుతూ వైసిపి పాలనలో అమరాపురం నుంచి విరుపాసముద్రానికి మంజూరైన రోడ్డును అర్ధాంతరంగా నిలిపేశారన్నారు. దీంతో గుంతల మయమైన రోడ్డులో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగి ఆసుపత్రి పాలయ్యారన్నారు. కావున అర్ధాంతరంగా ఆగిన పనులను పునః ప్రారంభించి తొందరగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఆర్అండ్‌బి డిఈ లక్ష్మీనారాయణ, ఏఈ నరసింహమూర్తి పాల్గొన్నారు



అధికారులతో సమావేశమైన తిప్పేస్వామి

7న కార్తీక వన సమారాధన : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై ఈ నెల 7వ తేదీ మండలంలోని అమగొండపాల్యంలో జిల్లా స్థాయిలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికైన ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11వ తేదీ వరకూ కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో ప్రకృతి పరిరక్షణ, చెట్లు పెంచడం, సంరక్షణ, వాతావరణ మార్పుల వల్ల జరిగే అనర్థాలు, తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సామాజిక వన విభాగం డిఎఫ్ఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాలోని కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం, అడవుల సంరక్షణపై పోటీలు నిర్వహించాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు 7వ తేదీ వన సమారాధనలో బహుమతులు అందజేస్తామన్నారు.

టిడిపి నాయకుడు మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కదిరి రూరల్ మండలంలోని మల్లయ్యగారిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, స్టోర్ డీలర్ రామచంద్రారెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన ఇంట్లో ఉండగా గుండెల్లో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలపడంతో హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ గ్రామం వెళ్లి రామచంద్రారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు రామచంద్రారెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పట్టణంలో వెలిసిన శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా అర్చకులు ఎమ్మెల్యేకి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. హోమంలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మార్కండేయస్వామి ఆలయంలో ఆర్డిఓ వీవి శర్మ

నల్లచెరువుమండల : స్థానిక భక్త మార్కండేయస్వామి ఆలయాన్ని బుధవారం కదిరి ఆర్డీవో వివిఎస్.శర్మ దంపతులు సందర్శించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్డీవోను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు జింకల సత్యనారాయణ, వేణు, అధికారులు ఉన్నారు.

సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అమరాపురం : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలలోని హేమావతి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పురాతన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతులు వెలిగించినట్లు అర్చకులు శివకుమార్ స్వామీజీ, సిద్ధలింగేశ్వర స్వామీజీ తెలిపారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి జ్యోతులు వెలిగించి పూజలు చేసినట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ కరేగౌడ్ తెలిపారు.

వయోజన విద్యపై శిక్షణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్య పర్యవేక్షకులు వెంకటరమణ అక్షర కేంద్రాల నిర్వహణ, వయోజనులకు బోధించే విధానంపై వాలంటీర్ టీచర్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అబ్దుల్‌నబి, ఉపాధి హామీ ఎపిఒ సుధాకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బందితో పాటు వాలంటీర్లు తమ పరిధిలోని అభ్యాసకులకు 2026 మార్చి నాటికి ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత గురించి బోధించి మండలంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. అనంతరం అక్షరాంధ్ర వాచకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, అక్షరాంధ్ర వాలంటీర్లు పాల్గొన్నారు.



అక్షరాంధ్ర వాచకాలను చూపుతున్న అధికారులు

12న ఉద్యోగుల క్రీడా పోటీలు

పుట్టపర్తి : అఖిల భారత సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 2025-26లో భాగంగా జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు ఈ నెల 12వ తేదీ నుంచి 19 క్రీడాంశాల్లో పెనుకొండ, ధర్మవరం పట్టణాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని సూచించారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా భాస్కర్ రెడ్డి

ముదిగుబ్బ : మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా భాస్కర్‌రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్ నారాయణస్వామి సొంత పనుల నిమిత్తం సెలవులో వెళ్లడంతో భాస్కర్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పజెప్పారు.

వీల్‌చైర్లు పంపిణీ

పుట్టపర్తి : పట్టణంలోని ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షామీర్ సహకారంతో బుధవారం మండలంలోని బొంతలపల్లి గ్రామానికి చెందిన మానసిక వికలాంగులు అపర్ణ, సునీల్‌కు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, ఎస్ఐ చేతుల మీదుగా రెండు వీల్ చైర్లు అందజేశారు. కార్యక్రమంలో షామీర్, అలీ, రామంజి, గంగాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దత్తత చట్టంపై అవగాహన

ముదిగుబ్బ : మండలంలోని సంకేపల్లి గ్రామంలో బుధవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ దేవమణి అధ్యక్షతన కౌన్సిలర్ శివలత ప్రజలకు పిల్లల దత్తత ప్రక్రియపై అవగాహన కల్పించారు. చట్టపరమైన దత్తత, పిల్లలు లేని దంపతులు చట్టపరంగా పిల్లలను ఎలా దత్తత తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఆయా మృతి

కదిరి టౌన్ : పట్టణంలోని కొలిమి ఏరియాలో పని చేస్తున్న అంగన్వాడీ సహాయకురాలు చంద్రకళ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రమీల, సుజాత, పద్మ, అరుణ, మోక్షప్రియ, రాధ, శారద యూనియన్ తరపున రూ. 6 వేలు అందజేశారు.

నీటి సరఫరాలో అంతరాయం

ధర్మవరం రూరల్ : పట్టణంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నీటి సరఫరా ఉండదని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ సాయికృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తంబాపురం వాటర్ వర్క్స్ వద్ద ఉన్న మ్యానిఫర్డ్ దెబ్బతిని నీరు వృథా అవుతుందన్నారు. దాని స్థానంలో కొత్త మ్యానిఫర్డ్ బిగించడానికి సుమారు మూడు రోజులు పడుతుందన్నారు. పట్టణ ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

కొత్తచెరువు : బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు తెలిపారు. శిబిరాన్ని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుందాం

ప్రజాశక్తి-లేపాక్షి

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుందామని హిందూపురం నియోజ కవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దీపిక పిలుపునిచ్చారు. మండలంలోని నాయనపల్లి, బిసలమానేపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2029లో వైసిపి కార్యకర్తల పాలన ప్రారంభం కాబోతోందని, జగన్ 2.0కి రథసారథులు కార్యకర్తలే అన్నారు. ఆ రోజున మీ గ్రామపంచాయతీలో ఏ పని జరగాల్సినా, ఏది కావాల్సి వచ్చినా గ్రామ కమిటీ అనుమతి లేకుండా ఏ పని జరగదని తెలిపారు. గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేసి, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైసిపి హయాంలో జగన్ 17 వైద్య కళాశాలలకు పునాది వేయగా 5 ప్రారంభమయ్యాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అంజనరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ బషీర్, నాయకులు నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు రవీంద్రారెడ్డి రామాంజి, నాయకులు రమేష్‌రెడ్డి, విజయ్, తిప్పన్న, రామంజి, శ్రీరాములు, లక్ష్మీనారాయణరెడ్డి, శేషాద్రిరెడ్డి జగన్నాథ్‌రెడ్డి, మూర్తి, ఫక్రుద్దీన్, సుధాకర్ రెడ్డి, కేశవమూర్తి, బాబు, రవికుమార్, చలపతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బిఎస్ మక్బూల్ పిలుపుమేరకు స్థానిక నాయకులు బోగాతిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు. అందులో భాగంగా పేదలకు వైద్యం, వైద్య విద్య మరింత అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో అప్పటి సిఎం జగన్ 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయించారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేస్తుందన్నారు. ఇలాంటి స్వార్థ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్, శంకర్‌నాయుడు, సూర్యనారాయణరెడ్డి, ఎస్.ఫయాజ్‌అలీ, మేకల నరసింహులు, కె.హుస్సేన్‌పీరా, మహమ్మద్ ఇక్బాల్, మైనుద్దీన్, ఆజాద్, నజీర్‌బాబు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



గాండ్లపెంటలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

పంటల పరిశీలన

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని తురకలాపట్నం, కోగిర గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వశించారు. అధికారులు వరి, మొక్కజొన్న, కంది, తదితర పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఏవో రాజేష్ ఆయా పంటల ఎదుగుదల, అధిక దిగు బడి, తెగుళ్ల నివారణకు మందులను సూచించారు. తురకలాపట్నం రైతు సేవా కేంద్రంలో జిప్సం అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు తీసుకెళ్లి వేరుశనగ, పండ్ల తోటలు, ఉద్యాన పంటలకు ఉపయోగించుకోవాలని సూచించారు. వారి వెంట ఆర్ఎస్‌కె సిబ్బంది నవీన్, భానుశ్రీ ఉన్నారు.

గాండ్లపెంట : మండలంలోని వేపలకుంట గ్రామంలో సాగుచేసిన వరి పంటను మండల వ్యవ సాయ అధికారి సయ్యద్‌షాదాబ్ పరిశీలించారు. వరిలో తెగుళ్ల నిరవాణకు మందులను సూచించారు. అనంతరం స్థానిక ఫర్టిలైజర్స్ షాపులను సందర్శించి, నాణ్యత పరిశీలన కోసం రసాయన ఎరువుల నమూనాలు సేకరించి విశాఖపట్నం ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది రాజేష్, పూజిత, ఫైరోజ్, ఫర్టిలైజర్ షాపుల యజమానులు మహబూబ్‌బాషా, గోపాల్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

తలుపుల : మండలంలోని పులిగుండ్లపల్లి, ఒదులపల్లి గ్రామాల్లో ఏవో పి.నాగమధుసూదన్, ఎఇఒ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు వరి, వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు తెగుళ్ల నివారణ మందులను సూచించారు. ఏవో మాట్లాడుతూ మండలానికి 720 క్వింటాళ్ల ఉలవలు మంజూరయ్యాయన్నారు. ప్రత్యామ్నాయంగా పంటలు సాగు చేసే రైతులు ఉలవల కోసం సమీప రైతుసేవాకేంద్రంలో రెండు రోజుల్లోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వారి వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు



రొద్దంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ధర్మవరం, ముదిగుబ్బ పాఠశాలల విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు పట్టణానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి అనంత పురం జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. బాలికల జట్టుకు పట్టణానికి చెందిన బి.నీఖ్యశ్రీ, ఎం.యశస్విని, వైష్ణవి, అలేఖ్య, బాలుర జట్టుకు సంజయ్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 7నుంచి 10 తేదీ వరకూ విశాఖ పట్నంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, తదితరులు అభినందించారు.

ముదిగుబ్బ : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రమాదేవి, ఎంఇఒ రమణప్ప, పిడి రేఖ తెలిపారు. ఇటీవల అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్-19 విభాగంలో ఎస్.యశ్వంత కుమారి, వైష్ణవి, అండర్-17 విభాగంలో ఎ.మహిత ప్రతిభ చాటారన్నారు. వీరు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ సెక్రటరీలు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ తెలిపారు.

వీధికుక్కల వ్యాప్తిని అరికడతాం : కమిషనర్

ప్రజాశక్తి-మడకశిర టౌన్

నగర పంచాయతీ పరిధిలో వీధి కుక్కల వ్యాప్తి నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం అనిమల్ బర్త్ కమిటీ సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి కరుణ అనిమల్ అండ్ నేచర్ సొసైటీ సహకారంతో స్టెరిలైజేషన్ ద్వారా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించి వీధి కుక్కల వ్యాప్తిని అరికడతామని తెలిపారు. స్థానిక వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ అమర్ మాట్లాడుతూ వైద్యశాలలో కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తారన్నారు. పట్టణ ప్రజలు వీధి కుక్కలు, పెంపుడు కుక్కలను ఆసుపత్రికి తీసుకొచ్చి ఈ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి శృతి, అధికారులు చంద్రమౌళి, మేరీ, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.



ఫొటో : సమావేశంలో పాల్గొన్న అధికారులు

భజన మందిరం ప్రారంభం

గోరంట్ల : పట్టణంలోని పెన్షనర్స్ భవన సమీపంలో సుమారు రూ. కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీసత్యసాయి భజన మందిరం భవనాన్ని బుధవారం శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్‌కు చెందిన ఆర్‌జె రత్నాకర్ ప్రారంభించారు. ముందుగా రత్నాకర్‌కు మందిరం నిర్వాహకులు శివారెడ్డి, విజయలక్ష్మి, భజన మండలి సభ్యులు, దాతలు స్వాగతం పలికారు. రత్నాకర్ మాట్లాడుతూ భజన మందిరాల్లో మనిషికి ప్రశాంతత దొరుకుతుందని, గోరంట్లలో శ్రీసత్యసాయి భజన మందిరం నిర్మించడం హర్షణీయమన్నారు. బాబా శత జయంతి వేడుకల్లో అందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలి

ధర్మవరం రూరల్ : పట్టణంలో అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలని ఎపి మాదిగ రక్షణ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఎంఆర్‌పిఎస్ నాయకులు కేశగాళ్ల శ్రీనివాసులు విలేక రుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు రాజకీయ నాయకులు, అధికారులకు అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేద న్నారు. దీంతో నూతన కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. అవసరమైతే తహశీల్దార్ కార్యాల యం ముందు రిలే నిరాహార దీక్షలతో పాటు దశల వారీగా ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ పోరాటానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బత్తలపల్లి : బత్తలపల్లి సమీపంలోని ఓ డాబా వద్ద గత నెల 15వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గత నెల 15వ తేదీ ధర్మవరం నుంచి బత్తలపల్లికి ప్రయాణికులతో వస్తున్న ఆటోను లారీ ఢీకొంది. ఆ ప్రమాదంలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో రామాంజనేయులు(60) చికిత్స పొంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఉన్నఫలంగా బుధవారం మృతి చెందాడు. అతడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇదే ప్రమాదంలో గాయపడిన గోగుల పెద్దన్న గత నెల 16వ తేదీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే.